



న్యూ ఇయర్ వేడుకల నేపథ్యంలో కడియం మండలం కడియపు లంకలో పూలబొకేల తయారీలో కార్మికులు ఇలా నిమగ్నమయ్యారు -: ప్రజాశక్తి - కడియం

2024 స్మృతి కవనం...

కొంత ఖేదం.. కొంత మోదం.. సుఖ సంతోషాలు, కష్టనష్టాలను పంచిన ఈ ఏడాది మరో కొన్ని గంటల్లో కాలగమనంలో కలిసిపోనుంది. మంచి చెడులను మనకే వదిలేసి మాయమైపోనుంది. జరిగిన తప్పుల నుంచి గుణపాఠాలు నేర్చుకుని మంచిగా జీవించాలనే సందేశాన్నిచ్చింది. ఎన్నో ఉద్యమాలకు ఊపిరి పోసింది. రాజకీయ మార్పులకు వేదికైంది. ఎన్నో స్మృతులను తనలో నిక్షిప్తం చేసుకుంది. ఆ స్మృతుల కవనం ఒకసారి ...

జనవరి 2024



అంగన్'వేడి'

సమస్యలు పరిష్కరించాలని, హామీలను అమలు చేయాలంటూ అంగన్‌వాడీలు సుదీర్ఘ పోరాటం చేశారు. ఎస్మాను ప్రయోగిస్తానన్నా భయపడకుండా పోరాటాన్ని కొనసాగించారు. 22న 'చలో విజయవాడ' నేపథ్యంలో అంగన్‌వాడీలను పోలీసులు నిర్బంధించారు.

10న తునిలో, 20న మండపేటలో, 29న రాజమహేంద్రవరంలో టిడిపి అధినేత నారా చంద్రబాబునాయుడు బహిరంగ సభను నిర్వహించారు.

14న ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా వ్యాప్తంగా కోడిపందేలు యథావిధిగా జరిగాయి. పోలీసులు ప్రేక్షక పాత్రకే పరిమితమయ్యారు. ఎన్నికల సంవత్సరం కావడంతో విపరీతంగా బరులు వెలసాయి. 29న రాజమహేంద్రరంలో 'రా.. కదిలిరా' సభలో టిడిపి అధినేత చంద్రబాబు పాల్గొన్నారు.

12న తుది ఓటర్ల జాబితాలను ఎన్నికల సంఘం విడుదల చేసింది

ఫిబ్రవరి 2024



కాంగ్రెస్ జోరు

7న డిఎస్‌సిని ప్రకటించాలంటూ డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరుద్యోగులు ధర్నాలు నిర్వహించారు.

9న రాజమండ్రిలో పిసిసి అధ్యక్షురాలు వైఎస్.షర్మిళ పర్యటించారు. 16న కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ దేశవ్యాప్త పిలుపులో భాగంగా రాజమహేంద్రవరం పోస్టాఫీసు నుంచి కోటగుమ్మం సెంటర్ వరకూ కేంద్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన జరిగింది. సిఐటియు, ఎఐటియుసి, ఐఎఫ్‌టియు సంఘాలు పాల్గొన్నాయి.

20న రాజమహేంద్రవరంలోని ఎవి.అప్పారావు రోడ్డులో ఉన్న జనసేన జిల్లా కార్యాలయంలో జనసేన నాయకులు, కూటమి నాయకులతో జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ సమావేశమయ్యారు.

22న గోపాలపురం మండలంలో దూడలపై పులిదాడి చేసినట్టు అటవీశాఖ అధికారులు ధ్రువీకరించారు.

మార్చి 2024



మోగిన నగరా...

మార్చి 16న ఎపి అసెంబ్లీ స్థానాలు, ఎంపీ స్థానాలకు ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. దీంతో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. అయితే అంతకు ముందు నుంచే జిల్లాలో ఎన్నికల సందడి మొదలైంది. ఆయా పార్టీలు అభ్యర్థులను ప్రకటించడంతో పాటూ ముందస్తుగా ప్రచారాన్ని నిర్వహించాయి. 23న కాకినాడ ఎంపీ, 24న రాజమండ్రి ఎంపీ స్థానాలకు కూటమి అభ్యర్థులను ప్రకటించింది. 26న టిడిపి పొలిట్ బ్యూరో సభ్యునిగా రెడ్డి సుబ్రహ్మణ్యం నియమితులయ్యారు. టిడిపి జాతీయ కార్యదర్శిగా మాజీ మంత్రి జవహర్‌ను నియమించారు.

27న అనపర్తి బిజెపి అభ్యర్థిగా మాజీ సైనికుడు శివకృష్ణంరాజు పేరును ప్రకటించారు.

30న కాకినాడ జిల్లా పిఠాపురంలో జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పర్యటించారు. ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు.

ఏప్రిల్ 2024



ఎట్టకేలకు తీర్పు

రాష్ట్రంలో సంచలనం సృష్టించిన వెంకటాయపాలెం శిరోముండనం కేసులో నేరం రుజువు కావడంతో ఎంఎల్‌సి తోట త్రిమూర్తులుకు విశాఖపట్నంలోని ఎస్‌సి, ఎస్‌టి ప్రత్యేక న్యాయస్థానం 18 నెలల జైలు, జరిమానా విధిస్తూ ఏప్రిల్ 16న తుది తీర్పును వెలువరించింది. అయితే అదే రోజున ఆయన బెయిల్‌పై బయటకు వచ్చారు. 25న రాజమహేంద్రవరంలోని ఆంధ్రా పేపరుమిల్లుకు యాజమాన్యం లాకౌట్ ప్రకటించింది. వివిధ పార్టీల అధినేతలు జోరుగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. వైసిపి అధినేత జగన్, టిడిపి అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్‌కళ్యాణ్‌లు బహిరంగ సభలు, రోడ్ షోలను నిర్వహించారు. 16న రాజమండ్రిలోని ఆనం రోటరీ హాల్లో నిర్వహించిన ప్రజాస్వామ్య పరిరక్షణ సభలో సిపిఎం, సిపిఐ రాష్ట్ర కార్యదర్శులు వి.శ్రీనివాసరావు, కె.రామకృష్ణ పాల్గొన్నారు.

మే 2024



'ఓటె'త్తారు...

మేలో ఎండల వేడిమికి ఎన్నికల సెగ తోడవ్వడంతో జిల్లాలో వాతావరణం వేడెక్కింది. పోలింగ్ తేదీ దగ్గర పడటంతో ఆయా పార్టీలు ముమ్మరంగా ప్రచారం నిర్వహించాయి. 7న రాజమహేంద్రవరంలో నిర్వహించిన సభలో ప్రధాని మోడి, జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ పాల్గొన్నారు. ఏప్రిల్ 13న ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. కాకినాడ జిల్లాలో 76.37, తూర్పు గోదావరి జిల్లాలో 79.43, డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలో 81.68 శాతం ఓటింగ్ నమోదైంది. ఇవిఎంలను నన్నయ యూనివర్శిటీలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రానికి తరలించారు. 19న కోనసీమ జిల్లా రావులపాలెంలోని గౌతమి గోదావరిలో స్నానానికి దిగి ఇద్దరు యువకుల మృత్యువాత, మరొకరు గల్లంతు. 26న రాజమహేంద్రవరంలో దంపతుల అనుమానాస్పద మృతి సంచలనంగా మారింది.


జూన్ 2024



కొలువుదీరిన కొత్త ప్రభుత్వం

జూన్‌లో కొత్త ప్రభుత్వం కొలువు దీరింది. 4వ తేదీన నన్నయ యూనివర్శిటీలో ఎన్నికల కౌంటింగ్ ప్రారంభమైంది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో కూటమి క్లీన్ స్వీప్ చేసింది. అన్ని స్థానాల్లో హవా చాటింది. వార్ వన్‌సైడ్ అన్నట్టుగా మూడు జిల్లాల్లో మొత్తం 21 స్థానాలను కైవసం చేసుకుంది. వీటిలో టిడిపి అభ్యర్థులు 14 స్థానాల్లో, జనసేన అభ్యర్థులు 6 స్థానాల్లో, బిజెపి అభ్యర్థి ఒక స్థానంలో విజయకేతనం ఎగురు వేశారు. అధికార వైసిపి పార్టీ ఘోర పరాజయం పొందింది. కాకినాడ, రాజమండ్రి, అమలాపురం పార్లమెంటు స్థానాలను సైతం కూటమి తన ఖతాలో జమేసుకుంది. 12న కేబినేట్ ఎన్నిక జరిగింది. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా నుంచి కూటమి ప్రభుత్వంలోకి జనసేన అధినేత పవన్ కల్యాణ్, కందుల దుర్గేష్, వాసంశెట్టి సుభాష్‌లకు చోటు దక్కింది. 23న జిల్లా కలెక్టర్లను మార్పు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

జులై 202



వరదపోటు

జులై 3న కాకినాడ జిల్లాలో ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ పర్యటించారు. పలు ముఖ్య శాఖల అధికారులతో సమీక్షా సమావేశాలు నిర్వహించారు.

9న కాకినాడ జిల్లా తాళ్లరేవు మండల పరిధిలోని కోరంగి వన్యప్రాణి అభయాణ్యంలో నీటి పిల్లులు గణనపై అటవీశాఖ దృష్టి సారించింది.వీటి గణనకు ప్రత్యేక కార్యాచరణను రూపొందించింది.

18న జెఎన్‌టియుకె ఇన్‌ఛార్జి విసిగా కెవిఎస్‌జి.మురళీకృష్ణను, నన్నయ విశ్వవిద్యాలయం ఇన్‌ఛార్జి విసిగా వై.శ్రీనివాసరావును నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీగా చేసింది.

28న గోదావరికి భారీగా వరద పోటెత్తింది. కోనసీమ లంకలను ముంచెత్తింది. గోదావరిని ఆనుకుని ఉన్న పల్లపు ప్రాంతాలు, పంటలు నీట మునిగాయి.

ఆగస్టు 2024



సినిమా చెట్టు ఇక లేదు

ఆగస్టు 5న కొవ్వూరు మండలం కుమారదేవంలో గోదావరి ఒడ్డున ఉన్న సినిమా చెట్టు నేలకొరిగింది. ఈ వృక్షం వయసు 150 సంవత్సరాలు. ఈ చెట్టు వద్ద అనేక సినిమా షూటింగ్‌లు జరిగాయి.

సమస్యలను పరిష్కరించాలంటూ స్కీమ్ వర్కర్లు కలెక్టరేట్లను ముట్టడించారు. భారీగా కార్మికులు పాల్గొన్నారు.

23న సిఎం చంద్రబాబు డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట మండలం వానపల్లిలో పర్యటించారు. గ్రామసభలో పాల్గొన్నారు. పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేశారు.

31న పుష్కరాలు-2027కు సంబంధించి కలెక్టర్ అధ్యక్షతన సమీక్షా సమావేశం జరిగింది. రైల్వేస్టేషన్‌ను రూ.240 కోట్లతో అభివృద్ధి చేయాలని నిర్ణయించారు.

సెప్టెంబర్ 2024



ఏలేరు ఉగ్రరూపం

సెప్టెంబర్ 2న గోదావరికి మరోసారి వరదలు వచ్చాయి. దీంతో పలుచోట్ల పొలాలు, లోతట్టు ప్రాంతాలు నీటమునిగాయి. 8న రాజమహేంద్రవరంలో పులి సంచారం కలకలం సృష్టించింది. 10 రోజుల పాటు సంచరించి చివరికి కనిపించకుండా మాయమైంది. 10న ఏలేరు ఉగ్రరూపం దాల్చింది. ఏలేరు పరివాహక ప్రాంతాలను ముంచెత్తింది. వరద ముంపు ప్రాంతాల్లో 11న సిఎం చంద్రబాబు పర్యటించారు. 12న దేవరపల్లి మండలం చిన్నాయిగూడెం శివారు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఏడుగురు కూలీలు మృతి చెందారు. వీరంతా నిడదవోలు మండలానికి చెందినవారు.

సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారం ఏచూరి మరణంతో జిల్లాలో విషాదం నెలకొంది. ఆయన కాకినాడకు చెందిన వారు. ఈ సందర్భంగా పలువురు సంతాపం వ్యక్తం చేశారు

అక్టోబర్ 2024



ఇసుక పోరు

4న ఉచిత ఇసుక కోసం భవన నిర్మాణ రంగ కార్మికులు వివిధ రూపాల్లో నిరసనలు తెలిపారు.

16న జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రులన్ను ప్రభుత్వం నియమించింది. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రిగా కింజరాపు అచ్చెన్నాయుడు, కాకినాడ జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రిగా నారాయణ, తూర్పు గోదావరి జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రిగా నిమ్మల రామానాయుడు నియమితులయ్యారు.

21న వాలంటీర్ హత్య కేసులో మాజీ మంత్రి పినిపే విశ్వరూప్ కుమారుడు పినిపే శ్రీకాంత్‌ను పోలీసులు అరెస్టు చేశారు.

27న గోకవరం మండలం గుమ్మళ్లదొడ్డిలో ఉన్న అస్సాగో ఇథనాల్ పరిశ్రమ కాలుష్యాన్ని వ్యతిరేకిస్తూ గ్రామస్తులు చేపట్టిన ఆందోళనపై పోలీసులు లాఠీఛార్జ్ చేశారు. నిరవధిక నిరహారదీక్ష చేస్తున్న ఉద్యమకారులను బలవంతంగా అరెస్టు చేశారు.

నవంబర్ 2024



దారుణం

1న కాజులూరు మండలం శెలపాక గ్రామంలో ముగ్గురు దారుణ హత్యకు గురయ్యారు. వివాహేతర సంబంధం విషయంలో బత్తుల చినన్నయ్య, పొట్లకాయల నాగేశ్వరరావు కుటుంబాల మధ్య పాత కక్షలు ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే బత్తుల చిన్నయ్య, బత్తుల రాజు, బత్తుల రమేష్‌లను అతిదారుణంగా హత్య చేశారు.

2న కడియం మండలం బుర్రిలంకలో ఒడిసాకు చెందిన మహిళపై ముగ్గురు అత్యాచారానికి పాల్పడి, హత్య చేశారు.

5న ఉండ్రాజవరం మండలం తాడిపర్రులో ఫ్లెక్సీ కడుతూ విద్యుత్ షాక్‌కు గురియై నలుగురు యువకులు మృతి చెందారు.

10న కుడా, రుడా ఛైర్మన్లుగా తుమ్మల రామస్వామి, బొడ్డు వెంకటరమణ చౌదరి నియమితులయ్యారు.

13న శాసన సభ విప్‌లుగా ఎంఎల్ఎలు యనమల దివ్య, దాట్ల సుబ్బరాజు నియామకం.

డిసెంబర్ 2024



సమరోత్సాహం

సిపిఎం మూడు జిల్లాల మహాసభలు ఉత్సాహభరిత వాతావరణంలో సాగాయి. సిపిఎం శ్రేణుల్లో సమరోత్సాహాన్ని నింపాయి. ప్రజా సమస్యలపై సమగ్రంగా చర్చించి చేపట్టేబోయే ప్రజాపోరాటాలకు దిశానిర్దేశం చేశాయి. కాకినాడ సిపిఎం జిల్లా కమిటీ 11 మందితో, డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా కన్వీనింగ్ కమిటీ ఏడుగురితో, తూర్పు గోదావరి జిల్లా కమిటీ 12 మందితో ఏర్పాటైంది. కాకినాడ జిల్లా కార్యదర్శిగా కరణం ప్రసాదరావు, తూర్పు గోదావరి జిల్లా కార్యదర్శిగా టి.అరుణ్, డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా కన్వీనర్‌గా కారం వెంకటేశ్వరరావు ఎన్నికయ్యారు.

టీచర్స్ ఎంఎల్‌సి ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థి బొర్ర గోపిమూర్తికి గురువులు ఘన విజయాన్ని అందించారు. మొదటి ప్రధాన ఓటుతోనే భారీ విజయాన్ని కట్టబెట్టారు.

ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలి

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ పి.ప్రశాంతి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఉచిత ఇసుక కోసం జిల్లాలో 15 ఒపెన్ రీచ్‌లు, 14 డీ-సిల్టేషన్ పాయింట్లు కేటాయించామన్నారు. ఇసుక రవాణా వ్యవస్థపై వస్తున్న ఆరోపణలు నేపథ్యంలో మరింత సమర్థవంతంగా నిఘా పెట్టాల్సి ఉందన్నారు. అనధికార చెల్లింపులపై దృష్టి సారించాలన్నారు. ఇందుకోసం డిఎల్ఎస్ఎ కమిటీ సభ్యులు సమిష్టిగా పని చేయాలన్నారు. ఇసుక అందుబాటులో లేని కాకినాడ జిల్లాకి రెండు, పశ్చిమ గోదావరి జిల్లాకు ఒకటి, విశాఖకు నాలుగు రీచ్‌లు ప్రత్యేకంగా కేటాయించినట్లు తెలిపారు. నీట మునిగి ఉన్న రీచ్‌లకు బదులుగా ప్రత్యామ్నాయ పాయింట్లు సూచించాలన్నారు. సెమీ మెకనైజ్డ్ విధానంలో ఎటువంటి ఆటంకం లేకుండా ప్రజా అభిప్రాయ సేకరణ ప్రక్రియ చేపట్టాలన్నారు. ఇందుకోసం ప్రామాణిక ఆపరేటింగ్ విధానాలు కచ్చితంగా పాటించాలని తెలిపారు. ఈ సమావేశంలో జెసి ఎస్.చిన్నరాముడు, ఆర్‌డిఒ రాణి సుస్మిత, జిల్లా మైన్స్ అధికారి డి.ఫణిభూషణ్ రెడ్డి, ఇరిగేషన్ డిఇ కె.ఆనంద్‌బాబు, జిల్లా రవాణా అధికారి ఆర్.సురేష్, జిల్లా భూగర్భ జల అధికారి వై.శ్రీనివాస్, జిల్లా ఆర్‌డబ్ల్యుఎస్ అధికారి బివి.గిరి, జిల్లా వ్యవసాయ అధికారి ఎస్.మాధవరావు, ఇన్‌ఛార్జి డిపిఒ ఎం.నాగలత, మైన్స్ అధికారి విఘ్నేష్, తదితరులు పాల్గొన్నారు.



జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

బిసి హాస్టల్ వద్ద తుప్పలు, చెత్త తొలగింపు

'ప్రజాశక్తి' వార్తకు స్పందన

ప్రజాశక్తి -గోపాలపురం

స్థానిక పెద్దగూడెంలోని బిసి బాలురు సంక్షేమ వసతిగృహం చుట్టూ ఉన్న తుప్పలు, చెత్తను పంచాయతీ సిబ్బంది సోమవారం తొలగించారు. తుప్పలు, చెత్త కుప్పలతో నానా ఇబ్బందులు పడుతున్నామని, పాములు సైతం వసతి గృహాల్లోకి వస్తున్నాయంటూ హాస్టల్ విద్యార్థులు భయాందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో 'బిసి హాస్టల్ వద్ద తుప్పలు, చెత్త కుప్పలు' శీర్షికన ప్రజాశక్తి దినపత్రికలో ఈ నెల 30న వార్త ప్రచురితమైంది. దీనికి పంచాయతీ అధికారులు వెంటనే స్పందించారు. పంచాయతీ కార్యదర్శి అనురాధ, హాస్టల్ సిబ్బంది పర్యవేక్షణలో హాస్టల్ చుట్టూ ఉన్న దట్టమైన మొక్కలను, చెత్త కుప్పలను తొలగించారు. ఈ సందర్భంగా విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు.



పనులను పర్యవేక్షిస్తున్న పంచాయతి సెక్రటరీ అనురాధ



తమ్మన్నదొరకు ఆదర్శ రైతు అవార్డు

ప్రజాశక్తి-గోకవరం

పామాయిల్ సాగులో అధిక దిగుబడి సాధించిన రైతుగా గోకవరం గ్రామానికి చెందిన మాజీ సొసైటీ అధ్యక్షులు దాసరి తమ్మన్నదొరకు ఆదర్శ రైతు అవార్డు దక్కింది. ఆదివారం రాజానగరం మండలం వడిసిలేరులో జిఎస్ఎల్ మెడికల్ కళాశాల అధినేత గన్ని భాస్కరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ఈ అవార్డును అందుకున్నారు. పతంజలి ఆయిల్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఈ అవార్డులను అందించింది. ఈ కార్యక్రమంలో డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణమరాజు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.

రోడ్డు పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి-గోకవరం

మండలంలోని గుమ్మళ్లదొడ్డిలో మండల పరిషత్ నిధులతో శ్మశాన వాటికకు చేపట్టిన సిమెంట్ రోడ్డు పనులకు ఎంపిపి సుంకర శ్రీవల్లి భర్త వీరబాబు సోమవారం శంకుస్థాపన చేశారు. రూ.3లక్షతో ఈ పనులు చేపడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యులు కోట సత్యవతి, సూరిబాబు, సర్పంచ్ రామలక్ష్మి, మురళీకృష్ణ, వార్డు సభ్యులు శివాజీ గ్రామస్తులు పాల్గొన్నారు.



శ్యామలా సెంటర్‌లో నిరసన తెలుపుతున్న వామపక్షాలు, కెవిపిఎస్ నాయకులు

అమిత్‌షా రాజీనామా చేయాలి

వామపక్షాల ఆధ్వర్యంలో ధర్నా

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్.అంబేద్కర్‌పై పార్లమెంట్‌లో విద్వేష అనుచిత వ్యాఖ్యలు చేసి అవమానించిన కేంద్ర హోం మంత్రి అమిత్‌షా తక్షణమే రాజీనామా చేయాలని శ్యామల సెంటర్‌లో వామపక్షాల నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్, సిపిఐ సీనియర్ నాయకులు నల్లా రామారావు, సిపిఐఎంల్ న్యూ డెమోక్రసీ నాయకులు సూరిబాబు, పౌర హక్కుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీమన్నారాయణ, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి జె.రాంబాబు మాట్లాడారు. అంబేద్కర్ అంటే బిజెపి, ఆర్ఎస్ఎస్ శక్తులకు ఎంత ద్వేషం ఉందో మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలే చెబుతున్నాయన్నారు. మనుస్మృతి పాలన కోసం రాజ్యాంగానికి తూట్లు పొడుస్తున్నారన్నారు. కోట్లాది నిమ్న జాతుల ప్రజల ఆత్మ గౌరవానికి అంబేద్కర్ ప్రతిబింబం అన్నారు. ఆయన్ని అవమానించిన అమిత్‌షా తగిన మూల్యం చెల్లించక తప్పదన్నారు. ప్రధాని స్థాయిలో ఉన్న మోడీ మంత్రి అమిత్‌షా వ్యాఖ్యలను సమర్థించడం తగదన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి.పవన్, పి.తులసి, జిల్లా కమిటీ సభ్యులు పూర్ణిమరాజు, రాజా, సుబ్రహ్మణ్యం, సుందర్‌బాబు, నాయకులు ఎస్ఎస్.మూర్తి, తాతారావు, శ్రీను, సిపిఐ నాయకులు వి.కొండలరావు, కె.రాంబాబు, రమణ, న్యూ డెమోక్రసీ నాయకులు జోజి, రమణ రెడ్డి, పౌర హక్కుల సంఘం కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

విద్యుత్ షాక్‌తో క్లీనర్ మృతి

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని చిన బ్రహ్మదేవం గ్రామంలో విద్యుత్ షాక్‌తో లారీ క్లీనర్ పెన్నెట్టి నాగేశ్వరరావు(56) మృతి చెందినట్లు ఎస్ఐ మౌనిక తెలిపారు. కలకత్తా నుంచి బొగ్గు లోడుతో వచ్చిన లారీ బొగ్గును అన్‌లోడ్ చేసి చేపల కాలీ తొట్టిలను పాలకొల్లు తీసుకువెళ్లేందుకు లోడింగ్ చేస్తున్న సమయంలో లారీ క్లీనర్ పైకి ఎక్కాడు. ఈ నేపథ్యంలో పైన ఉన్న విద్యుత్ లైన్లు తాకడంతో విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. దీంతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు పశ్చిమగోదావరి జిల్లా కోడూరు మండలం మట్టపర్రు వాసిగా గుర్తించామన్నారు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పెద్దాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించామని, ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ చెప్పారు.

వరి కుప్ప దగ్ధంపై కేసు నమోదు

ప్రజాశక్తి - కోటనందూరు

మండలంలోని జగన్నాథపురం గ్రామ సమీపంలో వరి కుప్ప దగ్ధంపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ టి.రామకృష్ణ తెలిపారు. గ్రామానికి చెందిన రైతు బంగారు కొండబాబుకు చెందిన రెండు ఎకరాల్లో పండిన వరి పంటను కుప్పగా వేశాడు. అయితే ఆదివారం రాత్రి ఆ కుప్ప దగ్ధం అయిపోయిందని ఫిర్యాదు చేశాడు. దీంతో సంఘటనా ప్రాంతాన్ని సోమవారం సిఐ జి.చెన్నకేశవరావు, ఎస్ఐ టి.రామకృష్ణ సందర్శించారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి వరి కుప్ప ప్రమాదవశాత్తు తగలబడిందా? లేక ఎవరైనా తగలబెట్టారా? అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

10 మద్యం సీసాల స్వాధీనం

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని నీలాద్రి రావు పేట గ్రామంలో సోమవారం నిర్వహించిన దాడుల్లో నిల్వ చేసిన 10 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని ఒక వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు సిఐ అర్జునరావు తెలిపరు. ఈ దాడిల్లో ఎక్సైజ్ ఎస్ఐలు ప్రసాదరావు, చిట్టిబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

పది మంది బైండోవర్

ప్రజాశక్తి - పెద్దాపురం

మండల పరిధిలో 10 మంది కోడిపందేలు ఆడే పాత ముద్దాయిలను బైండోవర్ చేసి సోమవారం తహాశీల్దార్ సిహెచ్.వెంకటలక్ష్మి వద్ద హాజరు పరిచినట్లు ఎస్ఐ మౌనిక తెలిపారు.

సారా బట్టీపై దాడి

ప్రజాశక్తి - రౌతులపూడి

మండలంలోని ఎస్ అగ్రహారంలో సారా తయారీ కేంద్రంపై తుని ఎక్సైజ్ ఎస్ఐ శాస్త్రి ఆధ్వర్యంలో సిబ్బంది దాడి చేశారు. ఈ దాడిలో సారా తయారీకి ఉపయోగించే 300 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు.

పేకాట శిబిరాలపై దాడి

ప్రజాశక్తి - చాగల్లు

చాగల్లు గ్రామ శివారు కోళ్ల ఫారంలో ఆదివారం రాత్రి కొవ్వూరు రూరల్ ఎస్ఐ కె.శ్రీహరి తన సిబ్బందితో కలిసి పేకాట శిబిరాలపై దాడులు చేశారు. 26 మందిని అరెస్టు చేశారు. వారి నుంచి రూ.1.48 లక్షల నగదు, 26 సెల్ ఫోన్లు, నాలుగు బైకులను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేశామని స్టేషన్ రైటర్ పెరవలి శ్రీనివాస్ తెలిపారు

ఆలమూరు : మండలంలోని నర్సిపూడిలో పేకాట శిబిరంపై పోలీసులు నిర్వహించిన దాడిలో ఏడుగురిని అదుపులోనికి తీసుకుని కేసు నమోదు చేశారు. రావులపాలెం రూరల్ సిఐ సిహెచ్.విద్యా సాగర్‌కు వచ్చిన సమాచారం మేరకు ఎస్ఐ ఎం.అశోక్ సిబ్బందితో ఆదివారం అర్ధరాత్రి నర్సిపూడిలో పేకాట శిబిరంపై దాడి చేశారు. ఏడుగురిని అదుపులోనికి తీసుకుని వారి వద్ద రూ.21,100లు నగదును స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ తెలిపారు.

బాల్య వివాహం చేసుకున్న యువకుని అరెస్ట్

ప్రజాశక్తి - రాజానగరం

బాల్య వివాహం చేసుకున్న ఒక యువకుడుని పోలీసులు అరెస్టు చేశారు. బాలికను జిల్లా బాలిక సంరక్షణ కేంద్రానికి పంపారు. ఈనెల 25న రాజానగరం మండలం కొత్తతుంగపాడుకు ,చెందిన దొడ్డా మణికంఠ అదే గ్రామానికి చెందిన 16 ఏళ్ల బాలికతో బంధువులు, పెద్దల సమక్షంలో వివాహం చేశారు. వివాహ చట్టం ప్రకారం బాలికకు 21 ఏళ్ల నిండకపోవడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. రంగపేట ఐసిడిఎస్ సూపర్‌వైజర్ ఎస్‌కెజి.బేగం బాలికను జిల్లా బాలికా సంరక్షణ కేంద్రానికి పంపారు.

గడ్డి మందు తాగిన వ్యక్తి మృతి

ప్రజాశక్తి - సీతానగరం

గడ్డి మందు తాగిన వ్యక్తి చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో ఈ నెల 29న మృతి చెందాడు. కూనవరం గ్రామానికి చెందిన బడుగు గరటయ్య(34) కొంతకాలం నుంచి మద్యానికి బానిసయ్యాడు. ఈనెల 28న కూనవరం సచివాలయం వద్ద పడిపోయి ఉన్నాడు. కుటుంబ సభ్యులు గమనించి చూడగా గడ్డి మందు తాగినట్టు గుర్తించారు. వెంటనే రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో ఈ నెల 29 సాయంత్రం మృతి చెందాడు. మృతునికి భార్య కుమారుడు ఉన్నారు. సోదరుడు బడుగు ముత్యాలరాయుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ రామ్‌కుమార్ తెలిపారు.

ఎటిఎంలో చోరీకి విఫల యత్నం

గోపాలపురం : ఎస్‌బిఐ ఎటిఎంలో చోరీకి గుర్తు తెలియని వ్యక్తి విఫల యత్నం చేశాడు. ఈ ఘటన ఆదివారం అర్ధరాత్రి చోటు చేసుకుదంఇ. స్థానికులు, బ్యాంకు సిబ్బంది సమాచారం మేరకు ఎస్ఐ కె.సతీష్‌కుమార్ ఈ ఎటిఎంను పరిశీలించారు. ఎస్ఐ మాట్లాడుతూ ఆదివారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తి బండ రాయితో ఎటిఎంను పగలగొట్టేందుకు ప్రయత్నం చేసి ఉన్నట్టు అనుమానిస్తున్నామన్నారు. ప్రయత్నం విఫలం కావడంతో అక్కడ నుంచి పరారయ్యాడని తెలిపారు ఈ మేరకు కేసు నమెదు చేశామని తెలిపారు.



ఎటిఎంను పరిశీలిస్తున్న పోలీసులు

అల్లర్లు సృష్టిస్తే చర్యలు తప్పవు :ఎస్‌పి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

నూతన సంవత్సర వేడుకల్లో అల్లర్లు సృష్టిస్తే చర్యలు తప్పవని ఎస్‌పి డి.నరసింహకిశోర్ హెచ్చరించారు. జాంపేటలోని పోలీసు కన్వెన్షన్ హాల్లో సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. 2024 వార్షిక నేర సమీక్షను విడుదల చేశారు. 2023లో ప్రజాసమస్యల పరిష్కార వేదికకు 1,897 కేసులురాగా 2024లో 1,721 నమోదయ్యాయన్నారు. 2023లో పెట్టీ కేసులో 4,195 నమోదు కాగా 2024లో 18,210 కేసులు పెరిగాయన్నారు. ఆస్తి తగాదాలు 2023లో 957 కేసులు నమోదు కాగా 2024లో 855 వచ్చాయన్నారు. చోరీలో రికవరీ 2023లో 30 శాతంకాగా 2024లో 53 శాతానికి పెరిగిందన్నారు. చీటింగ్ కేసులు 2023లో కంటే 3శాతం పెరిగాయన్నారు. 2024లో 355 కేసులు నమోదయ్యాయని తెలిపారు. సైబర్ నేరాలు 2023లో 120 నమోదు కాగా 2024లో 140 కేసులు నమోదు చేశామన్నారు. ఎస్‌సి ఎస్‌టి అట్రాసిటీ కేసులు గతేడాది 101 నమోదుకాగా ఈ ఏడాది కూడా 101 కేసులు నమోదయ్యాయని తెలిపారు. ఈ కేసులలో బాధితులైన 70 మంది మందికి రూ.41.85లక్షల పరిహారం అందించామన్నారు. మహిళలు, పిల్లలపై జరిగిన నేరాలు గతేడాది 1,032 ఉండగా 2024లో 890 తగ్గాయన్నారు. రోడ్డు ప్రమాదాలు ఈ ఏడాది 262 నమోదయ్యాయని తెలిపారు. 282 మంది మరణించగా 111 మంది గాయాల బారిన పడ్డారని ఆయన తెలిపారు. 206 మిస్సింగ్ కేసులు నమోదయ్యాన్నారు. గతేడాది 150 మంది ఆచూకీ లభించగా ఈ ఏడాది 139 మంది ఆచూకీ మాత్రమే లభించిందని తెలిపారు. అక్రమ మద్యం, సారా కేసులు గతేడాది 163 నమోదు కాగా ఈ ఏడాది 418 నమోదయ్యాయని తెలిపారు. గంజాయి కేసులు గతేడాది 69 నమోదు కాగా ఈ ఏడాది 65 కేసులు నమోదయ్యాయన్నారు. వారి నుంచి 2836.634 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. మోటారు వాహన చట్ట ఉల్లంఘన కేసులు 86,117 నమోదు అయ్యాయి. ఈ ఏడాది మొత్తం 1042 కేసులలో నిందితులకు శిక్ష పడిందన్నారు. లోక్ అదాలత్ ద్వారా ఈ ఏడాది 8057 కేసులు పరిష్కరించినట్లు ఎస్‌పి తెలిపారు. సైబర్ నేరాలపై జిల్లా వ్యాప్తంగా అవగాహనా సదస్సులు నిర్వహించామన్నారు.

జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్ లోగో ఆవిష్కరణ

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

రాజమహేంద్రవరం రూరల్ సత్యసాయి గురుకులంలో జనవరి 4న నిర్వహించబోయే సౌత్ ఇండియా సైన్స్ ఫెయిర్‌ను విజయవంతం చేయాలని జిల్లా పాఠశాల విద్యా శాఖాధికారి కంది వాసుదేవరావు నిర్వాహక కమిటీని ఆదేశించారు. స్థానిక కోటగుమ్మం వద్ద గల జిల్లా విద్యా శాఖాధికారి కార్యాలయంలో కమిటీ సభ్యులతో సమీక్ష నిర్వహించారు. మండల స్థాయి నుంచి ఎంపికైన ప్రదర్శనలు సమయానికి వారికి కేటాయించిన రూమ్స్‌కు చేరేలా చూడాలన్నారు. విద్యుత్‌తో పనిచేసే మోడల్స్‌కి సంబంధించిన ఏర్పాట్లు ముందుగానే చూసుకోవాలన్నారు. ఈ సందర్భంగా సైన్స్ ఫెయిర్ లోగోను ఆవిష్కరించారు. లోగోను రూపొందించిన సైన్స్ ఉపాధ్యాయులు దాసరి శివసత్యమూర్తిని అభినందించారు. ఈ కార్యక్రమం లో జిల్లా సైన్స్ అధికారి జి.శ్రీనివాసనెహ్రూ, అర్బన్ రేంజ్ డిఐ బి.దిలీప్‌కుమార్, నిర్వాహక కమిటీ సభ్యులు కోలా సత్యనారాయణ, మంగిన శ్రీ రామారావు, ఎస్‌ఎల్‌వి.రమేష్, రమణరావు తదితరులు పాల్గొన్నారు



లోగోను ఆవిష్కరిస్తున్న డిఎస్ఇఒ, డిఐ తదితరులు

ఎపిటిఎఫ్ డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - తాళ్లపూడి

ఎపిటిఎఫ్ ముద్రించిన 2025వ సంవత్సరం క్యాలెండర్, డైరీని కొవ్వూరు ఎంఎల్ఎలో కార్యాలయంలో ఎంఎల్ఎ ముప్పిడి వెంకటేశ్వరరావు ఆవిష్కరించారని ఎపిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు దున్నా దుర్గారావు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు అనిత జ్యోతి, కార్యదర్శి సనపల రాజశేఖర్, మండల అధ్యక్ష ఉపాధ్యక్షులు రఘువీర శాస్త్రి, రాజారత్నం తదితరులు పాల్గొన్నారు.

మాజీ ప్రధాని మన్మోహన్‌కు నివాళి

ప్రజాశక్తి -దేవరపల్లి

దేవరపల్లి మండలం దుద్దుకూరు గ్రామంలో కిసాన్ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు కాకర్ల హరిబాబు ఆధ్వర్యంలో మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్‌కు సోమవారం ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బొనిగే రాంబాబు, పాలకుర్తి ప్రభాకర్ చౌదరి తదిరులు పాల్గొన్నారు.

సిఎం సహాయ నిధి చెక్కుల అందజేత

ప్రజాశక్తి - తాళ్లపూడి

సిఎం సహాయ నిధి నుంచి మంజూరైన చెక్కులను పది మంది లబ్ధిదారులకు ఎంఎల్ఎ ముప్పిడి వెంకటేశ్వరరావు సోమవారం అదంఇంచారు. రూ.55 లక్షల విలువైన చెక్కులను ఆయన అందించారు. వేగేశ్వరపురం గ్రామంలో జరిగిన ఒక కార్యక్రమంలో ఈ చెక్కులను ఆయన అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు నామన పరమేశ్వరరావు, జివి.ప్రసాద్, కాకర్ల సత్యేంద్ర, అనపర్తి ప్రసాద్, కైగాల శ్రీనివాస్, చలపాటి ప్రకాష్, దేవన సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

ప్రజాశక్తి- కడియం

నూతన సంవత్సర వేడుకలను ప్రతి ఒక్కరూ కుటుంబ సభ్యులతో ఆనందంగా జరుపుకోవాలని మండపేట రూరల్ సిఐ పి.దొర రాజు అన్నారు. ఈ సందర్భంగా ముందుగా అందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. పాత సంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ, కొత్త సంవత్సరానికి ఆహ్వానం తెలుపుతున్నామన్నట్టు కొంతమంది ఆకతాయిలు 31వ తారీకు 12 గంటలకు చేసే హడావుడి ఎలా ఉంటుందో అందరికీ తెలిసిందే అన్నారు.అలాగే ఏదైనా హద్దు మీరితే అనర్థాలకు దారి తీస్తాయన్నారు. అలాంటివారిని ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. తాగిన మత్తులో రోడ్లపైకి రావడం విచక్షణారహితంగా వాహనాలను నడపడం చేస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. అంతే కాకుండా రోడ్లమీద కానీ, నాలుగు రోడ్ల కూడలిలో కానీ ఎలాంటి మందు గుండు సామగ్రి పేల్చటం. బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించడం, కేక్ కటింగ్ లు చేయడం వంటివి నిషేధమన్నారు. నూతన సంవత్సరం వేడుకల పేరుతో మహిళల పట్ల, ఇతర వాహనదారుల పట్ల అసభ్యకరంగా అమర్యాదగా నడుచుకుంటే చర్యలు తప్పవన్నారు. 31 రాత్రి తమ పిల్లలు ఎక్కడికి వెళ్తున్నారో, ఏం చేస్తున్నారు, అనే విషయాన్ని తల్లితండ్రులు తెలుసుకొని నిఘా పెట్టాలని ఆయన కోరారు.అన్ని ప్రధాన కూడళ్లలో , సమశ్యాత్మక గ్రామాలలో పోలీస్ బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ కార్యక్రమాలు జరిగిన పోలీసులకు వెంటనే సమాచారం అందించాలని ఆయన కోరారు.

పలు అంశాలపై కలెక్టర్ సమీక్ష

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

పలు అంశాలపై కలెక్టర్ పి.ప్రశాంతి సమీక్షించారు. సోమవారం కలెక్టరేట్ నుంచి జెసి ఎస్.చిన్నరాముడు, డిఆర్ఒ టి.సీతారామమూర్తిలతో కలిసి డివిజన్, మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. హౌసింగ్, జాతీయ రహదారులు, అంగన్‌వాడీ కేంద్రాలు, ఎన్‌పిసిఐ, ఎంఎస్ఎంఇ సర్వే, జిఎస్‌డబ్ల్యూఎస్ - హౌస్ హోల్డ్ సర్వే, జెజెం, రెవెన్యు సదస్సులపై సమీక్ష చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ, రాష్ట్ర వ్యాప్తంగా లక్ష ఇళ్ల నిర్మాణం కింద జిల్లాకి కేటాయించిన 4,384 ఇళ్ల నిర్మాణం పనుల్లో 3,817 ఇళ్లను పూర్తి చేశామన్నారు. మిగిలిన 1,232 ఇళ్లలో స్టేజ్ కన్వర్షన్ కింద 341 పురోగతి ఉన్నాయన్నారు. మండల పరిధిలో ఉన్న ప్రతి లేఅవుట్‌ను ఎంపిడిఒ వ్యక్తి గతంగా సందర్శించాలన్నారు. ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని ఆదేశించారు. శక్షం కింద అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించడం కోసం పనులను వేగవంతం చేయాలన్నారు. ఇంటి పన్నుల వసూళ్ల పరంగా 3,59,640 ఇళ్లకు 3,59,542 ఇళ్ల ఎసెస్మెంట్ చేసినట్లు తెలిపారు. జిల్లాలో పన్నులు రూ.85.56 కోట్లకు రూ.84.92 కోట్లను వసూలు చేసినట్లు తెలిపారు. ఇంకా రూ.1.64 కోట్లు వసూలు చేయాల్సి ఉందన్నారు. ఈ మేరకు ఎంపిడిఒలు చర్యలు తీసుకోవాలన్నారు. రెవెన్యూ సదస్సుల్లో అర్జీలను ఎప్పటికప్పుడు పిజిఆర్ఎస్ నమోదు చేసి, ఎస్ఒపి మేరకు పరిష్కారం చేయాలన్నారు. ఎమ్ ఎస్ ఎమ్ ఈ కి చెందిన సర్వే వేగవంతం చేయాలని, వాటి వివరాలు అప్లోడ్ చేయాలని ఆదేశించారు.


పార్కులను సక్రమంగా నిర్వహించాలి

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

నగరంలోని పార్కులను ప్రజలకు ఆహ్లాదం కలిగించేలా తీర్చిదిద్దాలని కమిషనర్ కేతన్‌గార్గ్ అధికారులను ఆదేశించారు. ఎన్ఆర్‌సిపి పంపింగ్ స్టేషన్ వద్ద గల కన్వెయిర్ బెల్టులను వెంటనే మార్పు చేయాలన్నారు. బెల్టుల పనితీరును ఎప్పటికప్పుడు పరిశీలించాలని సంబంధిత సిబ్బందిని ఆదేశించారు. తదుపరి 10వ వార్డులోని సాయినగర్ మరియు 17వ వార్డులోని సాయికృష్ణ నగర్ పార్కులను ఆయనప సందర్శించారు. వాకర్స్‌తో మాట్లాడారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వాకింగ్ ట్రాక్‌ను సరిచేయాలని, జిమ్ ఎక్విప్‌మెంట్‌కు మరమ్మతులు చేయించాలన్నారు. తాగునీరు, చిన్నపిల్లల ఆడుకునే పరికరాలు, టాయిలెట్స్ ఏర్పాటు చేయాలని స్థానికులు కోరారు. సాయినగర్ పార్కులో కూడా వాకింగ్ ట్రాక్‌ను సిరిచేయాలని మొక్కలు పెంచాలని ఓపెన్ జిమ్ ఎక్విప్‌మెంట్ ఏర్పాటుకు అంచనాలు తయారుచేయాలని ఆదేశించారు. పార్కులోని మరియు పార్కు బయట లైటింగ్ ఏర్పాటుకు అంచనాలు సిద్ధం చేయాలని అన్నారు.

వంగలపూడిలో గ్రామసభ

సీతానగరం : వంగలపూడి సచివాలయంలో సీతానగరం తహశీల్దార్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో రెవెన్యూ గ్రామ సభను సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా భూ సమస్యలపై ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రెవెన్యూ సమస్యల పరిష్కారానికి గ్రామసభలు నిర్వహిస్తున్నామన్నారు. రైతులు వాటిని వినియోగించుకోవాలని సూచించారు. సర్వేలో ఏమైనా లోపాలుంటే దరఖాస్తు చేసుకోవాలన్నారు.



సాయం అందిస్తున్న అభిరామ్

ఆపన్నులకు అండగా అభిరామ్

సీతానగరం : మాజీ ఎంఎల్ఎ పెందుర్తి వెంకటేష్ తనయుడు పెందుర్తి అభిరామ్ ఆపన్నులకు అండగా నిలుస్తున్నారు. చినకొండేపూడిలో పేద విద్యార్థిని చదువుకు రూ.75వేల ఆర్థిక సాయం అందించారు. విద్యార్థిని చదువుకు బాసటగా నిలిచారు. విద్యార్థిని తల్లిదండ్రులు ఆర్థిక ఇబ్బం దులతో సతమతమవుతున్నారు. ఈ కారణంగా ఫీజులు చెల్లించడం లేదనే విషయాన్ని కార్యకర్తల ద్వారా అభిరామ్ తెలుసుకుని ఈ సాయాన్ని అందించారు. అలాగే సింగవరంలో జరిగిన అగ్నిప్రమాదంలో సర్వసం కోల్పోయి నిర్వాసితులైన వృద్ధురాలికి ఆర్థిక సాయాన్ని అందించారు. తన వద్దకు వచ్చిన బాధితులకు అండగా ఉంటూ సాయం అందిస్తున్నారు. పలువురు ఆయన్ని అభినందిస్తున్నారు.

భూ సర్వేకు సహకరించాలి

ప్రజాశక్తి - చాగల్లు

భూ సర్వేకు సహకరించాలని తహాశీల్దార్ ఎం.మెరికమ్మ రైతులను కోరారు. సోమవారం మండలంలో బ్రాహ్మణగూడెంలో అవగాహనా ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులను ఉద్దేశించి ఆమె మాట్లాడారు. రెవెన్యూ సిబ్బంది పొలాలను రీసర్వే చేసే సమయంలో అందరూ సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో భూ సర్వే డిప్యూటీ తహాశీల్దార్ ఎస్.కమల్‌సుందర్, ఆర్ఐ షేక్ కమల్, మండల సర్వేయర్ గోపాలకృష్ణ, విఆర్ఒలు, సిబ్బంది పాల్గొన్నారు.

తాళ్లపూడి : నాలుగో విడత రీ సర్వే కోసం ప్రభుత్వం పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసిన కుకునూరు రెవెన్యూ పరిధిలోని వీరభద్రపురంలో సర్వే సమయంలో రైతులతో పాటు ప్రతి ఒక్కరూ సహకరించాలని డిప్యూటీ తహాశీల్దార్ భారతి కోరారు. ఈ మేరకు గ్రామంలో సోమవారం అవగాహనా ర్యాలీ నిర్వహించారు. మండల సర్వేయర్ సత్యనారాయణ మాట్లాడుతూ మార్చి నెల వరకు సర్వే జరుగుతుందన్నారు. నామన పరమేశ్వరరావు, విఆర్ఒలు పాల్గొన్నారు.

ఉండ్రాజవరం : వ్యవసాయ భూములకు సంబంధించిన రైతులకు రీసర్వేపై అవగాహన కల్పించేందుకు మండలంలోని సత్యవాడ గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసిందని డిప్యూటీ తహాశీల్దార్ ఎ.కనకదుర్గ తెలిపారు. గ్రామంలో సోమవారం నిర్వహించిన అవగాహనా ర్యాలీలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా జనవరి 2న సచివాలయంలో గ్రామ సభ జరుగుతుందన్నారు. మండలంలోని సర్వేయర్లు, విఆర్ఒలు, విఆర్ఎలను ఆరు బృందాలుగా విభజించామన్నారు. ఒక్కొక్క బృందంలో ఇద్దరు గ్రామ సర్వేయర్లు, విఆర్ఒ, విఆర్ఎ ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ జి.శ్రీనివాసరావు, రీ సర్వే డిప్యూటీ తహాశీల్దార్ ఎం.హరిప్రసాద్, పంచాయతీ కార్యదర్శి జి.ప్రసాదరావు, కమ్యూనిటీ సర్వేయర్ బి.చాందిని, విఆర్ఒ జె.లక్ష్మీనరసమ్మ తదితరులు పాల్గొన్నారు.

పిజిఆర్ఎస్‌లో 120 అర్జీల స్వీకరణ

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన పిజిఆర్ఎస్‌లో 120 అర్జీలను స్వీకరించామని కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. జెసి ఎస్.చిన్నరాముడు, డిఆర్ఒ టి.సీతారామమూర్తి, సిపిఒ ఎల్.అప్పలకొండ, డిఎల్‌డిఒ పి.వీణాదేవి, శివారెడ్డి, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో వస్తున్న అర్జీల్లో ఎక్కువ అర్జీలు క్షేత్ర స్థాయిలో పరిష్కారం లభించే అవకాశం ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలను అనుసరించి ప్రజల నుంచి వస్తున్న అర్జీలకి పరిష్కారం లభించే అవకాశం ఉందన్నారు. ఈ మేరకు ప్రజల్లో చైతన్యం తీసుకురావాల్సి ఉందన్నారు. స్థానికంగా ఉండే మండల కేంద్రంలో ప్రతి సోమవారం నిర్వహిస్తున్న పిజిఆర్ఎస్‌లో అర్జీలను అందించాలన్నారు.

నేడు పింఛన్ల పంపిణీ : కలెక్టర్

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

జిల్లా వ్యాప్తంగా సామాజిక పింఛన్లను మంగళవారం పంపిణీ చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. 9041 క్లస్టర్ ఏరియాలో 5,158 మంది సిబ్బంది ద్వారా లబ్ధిదారుల ఇంటి వద్దనే పింఛన్లు అందిస్తారన్నారు. ఉదయం 6 గంటల నుంచి ఈ ప్రక్రియ ప్రారంభమవుతుందన్నారు. జిల్లాలో మొత్తం 2,36,927 మందికి 17 కేటగిరీల్లో రూ .101.93 కోట్లను పింఛన్లుగా అందిస్తున్నామన్నారు.

అర్హులను తొలగిస్తే పోరాటం తప్పదు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

అనర్హత పేర పింఛన్లను తొలగిస్తే పోరాటం తప్పదని వైసిపి వికలాంగుల విభాగం జిల్లా అధ్యక్షులు ముత్యాల పోసికుమార్ హెచ్చరించారు. సోమవారం విలేకర్లతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పింఛన్లు పెంచామని గొప్పగా చెప్పుకుని, ఇప్పుడు అనర్హత పేరుతో కోతలు విధించడం తగదన్నారు. ప్రభుత్వ వ్యవస్థల్లో భాగమైన వైద్యులను నకిలీ ధ్రువీకరణ పత్రాలు జారీ చేస్తున్నారనే నెపంతో బెదిరింపులకు దిగడం శోచనీయమన్నారు. 2014 -19 నాటి టిడిపి ప్రభుత్వ హయాంలో అర్హులుగా ఉన్న వికలాంగులు, కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఆరునెలలు కాగానే అనర్హులు ఎలా అవుతారని ప్రశ్నించారు. సదరం వైద్య క్యాంపులను నిలిపేయడం తగదన్నారు.

ఎంఎల్ఎ నెహ్రూను కలిసిన శ్యామ్‌సుందర్

ప్రజాశక్తి-గోకవరం

మండలంలోని మల్లవరం గ్రామంలో బోపాల్ రాజ్ చెరువు నీటి సంఘం అధ్యక్షుడు సత్యం శ్యామ్‌సుందర్, కమిటీసభ్యులు జగ్గంపేట ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూని సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన వారిని అభినందించారు. రైతులకు సకాలంలో నీరు అందే విధంగా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నీటి సంఘ ఉపాధ్యక్షులు గంటా వీరబాబు, సభ్యులు కరణం గోవింద్, ఆది వీరబాబు, బి.వెంకటస్వామి, పి.కాత్రాజు, సర్పంచ్ అర్జునరావు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ సిబ్బంది తొలగింపు

ప్రజాశక్తి - సీతానగరం

సీతానగరం మండలం రఘుదేవపురం పంచాయతీ కార్యదర్శి కెఎస్.రాజశేఖర్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగి టి.లాల్‌కుమార్‌లను విధుల నుంచి తొలగిస్తూ కలెక్టర్ పి.ప్రశాంతి ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే బిల్ కలెక్టర్ వై.అర్జునుడును సస్పెండ్ చేశారు. నిధుల దుర్వినియోగం, వసూలు చేసిన పన్నులు దుర్వినియోగం ఆరోపణలు రుజువు కావడంతో ఈ చర్యలు తీసుకున్నట్టు తెలిపారు. అలాగే విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్న కడియం మండలం దుళ్ళ పంచాయతి సెక్రటరీ బి.సరోజరాణిని సస్పెండ్ చేసినట్టు తెలిపారు.

జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు ఎంపిక

ప్రజాశక్తి - గోపాలపురం

దక్షిణ భారత విద్యా వైజ్ఞానిక ప్రదర్శన(ఎస్ఐఎస్ఎఫ్) జిల్లా స్థాయి పోటీలకు మండలంలోని మూడు పాఠశాలలు ఎంపికయ్యాయని ఎంఇఒలు జి.శ్రీనివాసరావు, ఎ.మహేశ్వరరావు తెలిపారు. సోమవారం గోపాలపురం జడ్‌పి హైస్కూల్లో సదరన్ ఇండియా మండల స్థాయి సైన్స్ ఫెయిర్‌ను నిర్వహించారు. పలు పాఠశాలల విద్యార్థులు ప్రాజెక్టులను ప్రదర్శించారు. అందులో మండల స్థాయి నుంచి జిల్లా స్థాయికి మూడు పాఠశాలలు ఎంపికైనట్లు తెలిపారు. ఇండివిడ్యుయల్ విభాగంలో గోపాలపురం గురుకుల పాఠశాల, గ్రూపు విభాగంలో గోపాలపురం జడ్‌పి ఉన్నత పాఠశాల, టీచర్ విభాగంలో గురుకులు పాఠశాల ఎంపికయ్యాయన్నారు. గైడ్ టీచర్లకు విద్యార్థులకు అభినందనలు తెలిపారు.